# కథ ముగిసింది

-వాలి హిరణ్మయీదేవి

"ఏంటోదినా తాపీగా ఉన్నావు? అన్నయ్యగారికి ఆఫీస్ లేదా?" అడిగింది పక్కింటి పద్మజ.

"ఆఫీసకేం పిడిరాయిలా ఎంచక్కా ఉంది. ఈయనే లీవ్ పెట్టారు" చిరాగ్గా అంది వాణి.

"ఇంకేం ఎంచక్కా సినిమాకెళ్లండి" ఉచిత సలహా ఇవ్వడం చాలా ఈజీ కాబట్టి ఇచ్చేసింది పద్మజ.

"నా మొహానికి అదొక్కటే తక్కువయింది. ఆయనకి నెలకి దొరికేది రెండే లీవులు. చూసి చూసి లీవులు వాడుకోవాలి. మీ ఆయనదైతే గవర్నమెంటు ఉద్యోగం కాబట్టి లీవుల బాధలేదు" అంది అక్కసుగా వాణి.

'ఎప్పుడూ మామీదే ఏడుపు' అనుకుంటూ "లోపల పనుంది" అంటూ వెళ్లిపోయింది పద్మజ.

వంట గదిలోకి వెళుతూ బెడ్రూమ్‌లోకి తొంగి చూసింది వాణి. జుట్టు పీక్కుంటూ కన్పించాడు కేశవ్.

'హూ... పెళ్లిచూపులప్పుడు రింగురింగుల జుట్టుతో దొరబాబులా ఉన్నాడని కదూ ఈయన్ని చూడగానే సరేనన్నది. ఇప్పుడు బట్టతలతో యాభై యేళ్ల మనిషిలా అయిపోయాడు.

ఎందుకొచ్చిన పాట్లో ఈ ప్లాట్లు తట్టడానికి' అనుకుంటూ వంట పనిలో పడింది.

సాంబారు పొడి అయిపోవడంతో కాస్త ధనియాల పొడి చేద్దామని మిక్సీ ఆన్ చేసింది. ఆ చప్పుడుకు ఒక్కసారిగా బయటకు వచ్చి అరిచాడు కేశవ్.

"కాస్త సాంబారు చేద్దామని" సంజాయిషీ ఇవ్వబోయింది వాణి.

"ఏం ఒక్కరోజు సాంబారు లేకపోతే ఛస్తామా? పచ్చడేసుకుని తిని చద్దాం. ముందా మిక్సీ ఆపు" భయంకరంగా అరిచి చెప్పాడు కేశవ్.

ఠక్కున మిక్సీ స్విచ్‌ని నొక్కింది వాణి భర్త పీక నొక్కలేక ఆ కోపాన్ని దానిమీద చూపిస్తూ. కోపం వచ్చినప్పుడు బట్టలు ఉతికితే తెల్లగా వస్తాయన్నది అనుభవం కాబట్టి బాత్రూంలోకి వెళ్లిపోయి ఆ కార్యక్రమంలో నిమగ్నమైంది.

జాడించిన బట్టల్ని ఆరవేయడానికి పెరట్లోకి వెడుతూ మెల్లగా మళ్లీ బెడ్రూంలోకి తొంగి చూసింది.

కేశవ్ కన్పించలేదు. 'ఏమయ్యాడు' చెప్మా అని బట్టల్ని అక్కడే వదిలేసి రూమ్‌లోకి వచ్చింది. ఓ మూలనున్న కుర్చీలో కూర్చుని పకపకా నవ్వుతూ కథ రాస్తూ మళ్లీ అంతలోనే ఆ పేపర్ని చింపుతూ దాదాపు ఏడుస్తున్నట్లుగా మొహం పెట్టిన కేశవ్‌ని చూస్తే భయమేసింది ఆమెకి.

'కొంపదీసి పిచ్చిగానీ ఎక్కలేదుకదా' అని ఎలాగో ధైర్యం చేసి "ఏమండీ మొహం కడుక్కుంటారా? లేదూ కాఫీ కలిపి ఇస్తా. తాగేస్తారా?' అనడిగింది.

ఎర్రగా చూసాడతను. 'చూపుల్తోనే చంపేస్తాడా ఏమిటి?' అని గొణుక్కుంటూ "పోనీ టీ ఇవ్వనా?" అంది బిత్తరపోయి చూస్తూ.

"ఈ తెలివి తెల్లవారగానే ఉండొద్దూ. కడుపులో టీగానీ కాఫీగానీ పడకపోతే ఐడియాలు ఎలా వస్తాయి?" అన్నాడు కోపంగా. తనకి పొద్దుటినుంచీ ఒక్క ఐడియా తట్టకపోవడానికి ఆమే కారణం అని అనుకుంటూ. వెంటనే పరుగున వెళ్లి కాఫీ తీసుకుని వచ్చింది.

"టిఫిన్ ఏమైనా చేయాలా?" అనడిగింది మెల్లగా.

"వద్దు అదో టైమ్ వేస్ట్. ఏకంగా భోజనం చేస్తాను" చెప్పాడతను గంభీరంగా.

'అమ్మయ్యా' అనుకుంది కాస్త రిలీఫ్‌గా. లేకుంటే టిఫిన్ ఏం చేయాలో ఓ గంట ఆలోచించి నాలుగు రకాలు చెప్పి మరో అరగంట తరువాత డిసైడ్ చేసి చెప్తాడు. తొందరగా ఐదు నిముషాల్లో చేసే ఉప్మాని అతడు చెప్పిన విధంగానే చేస్తే గంట టైము ఇట్టే అయిపోతుంది మరి. బట్టలారేసి వంట ముగించి తనొక్కర్తీ భోజనం చేసింది వాణి.

కడుపులో ఇంత పడగానే నిద్ర కమ్ముకొచ్చింది. అదే మమూలుగా అయితే టీవీకి అతుక్కుపోయేది.

కానీ సౌండ్ డిస్టర్బెన్స్ అని భర్త అరుస్తాడని సోఫాలో ఒరిగింది. లేచేసరికి రెండున్నర అయింది. బెడ్రూంలో ఏ అలికిడీ లేకపోయేసరికి తొంగి చూసింది.

కేశవ్ టేబుల్ మీదే తల పెట్టుకుని నిద్రపోతున్నాడు. లేపుదామా వద్దా అని ఆ రూంలోకి వెళ్లి అరగంట ఆలోచించింది. లేపితే ఓ తంటా లేపకపోతే ఓ తంటా ఈ మనిషితో అనుకుంటూ అలాగే నిలబడిపోయింది.

అప్పుడే హఠాత్తుగా లేచిన కేశవ్ తల విరబోసుకుని నిలబడ్డ ఆమెను చూస్తూనే భయంతో కెవ్వుమన్నాడు కేశవ్.

"అరెరే... ఎందుకలా భయపడతారు. నేనండీ" అంది వాణి.

"దెయ్యంలా వచ్చి నిలబడ్డావేమే ధేభ్యం

మొహమా? నేను కథ వ్రాసుకునేటప్పుడు ఇక్కడికి రావొద్దని ఎన్నిసార్లు చెప్పాలి?'' కయ్‌మంటూ అరిచాడు.


కళ్లల్లోకి చివ్వున నీళ్లొచ్చాయి వాణికి.

“ఏమన్నా అంటే చాలు ఈ నయాగారాలొకటి'' విసుక్కున్నాడు.

“ఎందుకొచ్చిన కథలండీ... కూటికీ గుడ్డకూ పనికిరావు. పదిరోజులు పాటు ఈ లోకంలో ఉండకుండా ఆలోచనలతో జుట్టు పీక్కోవడం, నాలుగు రోజులపాటు నడుంనొప్పి పుడుతోందంటూ రాయడం, మరో రెండురోజులు ఆఫీసుకి లీవు పెట్టి ఫెయిర్ చేయడం, అటు ఆఫీసులో చీవాట్లు తినడం, జీతం కట్ చేసారంటూ ఫస్టునాడు బాధపడడం... ఇవన్నీ అవసరమంటారా? పిల్లల్ని కసురుకుంటూ నన్ను తిడుతూ మీరింత ఆపసోపాలుపడుతూ ఎందుకివన్నీ?'' బరస్టవుతూ అంది వాణి.

ఛర్రున కోపం వచ్చింది కేశవ్‌కి.

“దీన్నే శల్య సారధ్యం అంటారు. అరె... ప్రోత్సహించేదిపోయి ఇలా దెప్పిపొడుస్తుంటే ఇక కథలేం రాస్తాను, పేరేం సంపాదిస్తాను? అందరూ నీలాంటి పెళ్లాలుంటే ఇంతమంది మంచి రచయితలు ఉండేవాళ్లా? నాకు పేరొస్తే నీకొచ్చినట్లుగాదూ. పోయిన ఏడాది నా కథ పత్రికలో పడితే మీవాళ్లందరికీ చూపించి మురిసిపోలేదా? ఈ ఏడు పోటీలో పాల్గొని బహుమతి




పొందాలన్న దీక్షతో నేనుంటే నువ్వూ ఏ ఏడ్పు మొహమూనూ. మగాడి విజయం వెనుక ఓ ఆడది ఉంటుందట. అది ఖచ్చితంగా ఇలా ఏడ్చే ఆడది మాత్రం కాదు'' అన్నాడు కేశవ్ విసుగ్గా.

తను ఇన్ని అమర్చి పెడుతూ ఇంత ఒద్దిగ్గా క్షణక్షణం అతని గురించి ఆరాటపడుతుంటే అలా తననో వేస్ట్ సరుకుగా అతడు ట్రీట్ చేయడం ఆమెకి చాలా బాధనీ, అంతకుమించి కోపాన్ని కలిగించింది. అందుకే పిల్లలు స్కూల్ నుంచి రాగానే-


"నేనుండి ప్రయోజనం లేనప్పుడు ఎక్కడుంటే ఏంటి? మావాళ్లింటికి వెళ్లి ఓ వారం ఉండొస్తాను. ఈ వారంలో కథలే రాస్తారో నవలలే రాస్తారో రాసుకోండి'' అంటూ ఛర్రును వెళ్లి నాలుగు చీరలు సర్దుకుని పిల్లల్ని తీసుకుని వెళ్లిపోయింది వాణి.

నిర్ఘాంతపోయినా 'హూ... ఆడదానికి ఇంత అహంకారమా?' అనుకుంటూ ఆపే ప్రయత్నం కూడా చేయలేదు కేశవ్. పైగా ఇప్పుడే డిస్టర్బెన్స్



## ఇష్టంలేదు

విద్యాబాలన్‌కుకీ దూరపు చుట్టరికం వుందని తాజాగా సినీజనాలు తెగ చెప్పేసుకుంటున్నారు. ప్రియమణికి విద్యాబాలన్ కజిన్ అవుతుందిట. ప్రియమణి నటిస్తున్న హిందీ సినిమా 'రావణ్' గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు ఈమె విద్యకి సోదరి అంటూ ప్రచారం చేస్తున్నారట బాలీవుడ్ జనాలు. అయితే ప్రియమణికి మాత్రం ఇది సుతరామూ ఇష్టంలేదు. అందుకనే ఆ వార్తల గురించి ప్రస్తావిస్తే జవాబివ్వడం లేదట.




లేకుండా కథ రాసుకోవచ్చునని ఆనందించాడు కూడా.

డైనింగ్ టేబుల్‌మీదున్న వంటకాలన్నీ శుభ్రంగా తిని పేపర్, పెన్ను అందుకున్నాడు.

"హాయ్ కేశవ్! ఇంట్లోనే వున్నావా? ఏది వాణి?'' అంటూ వచ్చాడు దూరపు బంధువు వెడ్డింగ్ కార్డులు ఇవ్వడానికి.

"వాళ్లమ్మగారింటికి వెళ్లిందిలెండి. ఇంతకీ ఎప్పుడు పెళ్లి?'' అనడిగాడు కేశవ్ చిరాకును అణుచుకుంటూ.

"ఎప్పుడేంటి ఎల్లుండే. అదేంటో ఎన్నేళ్లుగానో చూస్తుంటే ఇప్పటికి కుదిరింది. అసలు ఎప్పుడో అయిపోయేది. నేనే ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. నేను కోరుకున్న లక్షణాలుండే సంబంధం ఇన్నాళ్లకు వచ్చింది'' అంటూ ఆ పెళ్లివారి గురించి ఓ గంట సుత్తి కొట్టి వెళ్లాడు. వయసులో పెద్ద వాడైనందుకు అతడిని ఓ గంట భరించక తప్పలేదు కేశవ్‌కి.

అతడు వెళ్లగానే తలుపులు పెట్టుకుని ఓ గ్లాసుడు మంచినీళ్లు తాగి మళ్లీ రచనకు ఉపక్రమించాడు. 'గడువు తేదీ ఇక నాలుగురోజులే వుంది. రాయడం ఎప్పుడు? కరెక్షన్స్ చేసుకోవడం ఎప్పుడు? ముఖ్యంగా ఫెయిర్ చేయడం ఎప్పుడు?' అనుకుంటూ పెన్ను అందుకున్నాడు. ఏంటో బుర్రంతా ఖాళీ.

అంతవరకూ రాసింది తనకే నచ్చలేదు. దేవుడా! ఓ మంచి ప్లాట్ అందిస్తే నా తలనీలాలు ఇస్తాను తండ్రీ... కాదు కాదు ఆ కథ పత్రికలో పడి ప్రైజ్ వస్తే' అంటూ ఓ అమెండ్‌మెంట్ కూడా చేసాడు. ఐనా ప్రయోజనం శూన్యం. ఛ... జుట్టంతా ఊడిపోయింది. 'అయ్యో నిలువుదోపిడీ ఇచ్చుకుంటా...సరేనా. నా కథ అందంగా వచ్చి ప్రచురింపబడేలానైనా చేయి' అనుకున్నాడు.

'అరె... నిలువుదోపిడీ అనేసేనేంటి?' అనుకుంటూ తన వంటిమీద ఏవన్నా వాల్యుబుల్ థింగ్స్ ఆర్నమెంట్స్ ఉన్నాయేమోనని పరికించి చూసుకున్నాడు.

లుంగీ, బనీను, మెళ్లో వెండి చైను, చేతివేలికో మూడు గ్రాముల ఉంగరం కన్పించి గతుక్కుమన్నాడు. 'భగవంతుడా! మూడుగ్రాముల ఉంగరం, వెండి చైన్ కలిసి నాలుగువేలు. కనీసం ఐదువేలొచ్చే ఫస్ట్ ప్రైజ్‌ని నువ్వు ఇప్పించకపోతే లాసయిపోతాను తండ్రీ. కాబట్టి కథ ప్రచురణకి ఎన్నిక కావడం కాదు, ఖచ్చితంగా ఫస్ట్‌ప్రైజ్ వచ్చేలా చేయి తండ్రీ. కనీసం ఓ వెయ్యి రూపాయలైనా మిగులుతుంది' అంటూ తన మొక్కుబడికి మరో అమెండ్‌మెంట్ చేసాడు. ఫలితంగానేమో మంచి ప్లాట్ తట్టిందతనికి. వెంటనే చకచకా రెండు పేపర్లు అరగంటలో రాసి 'అమ్మయ్యా... కథ ఎత్తుగడ బాగానే వచ్చింది.

ఇలా రాసేస్తే రెండు గంటల్లో కథ ముగుస్తుంది. రేపు ఎల్లుండి లీవు పెట్టి కరెక్షన్లు చేసుకుని ఫెయిర్ చేసుకుంటే సరి' అనుకున్నాడు హుషారుగా. ఇంతలో తలుపు చప్పుడయింది విసుగ్గా 'అబ్బా'అనుకుంటూ వెళ్లాడు.

ఎవరో డిటర్జెంట్ పౌడర్లు అమ్ముకునే అబ్బాయి ఎదురుగా కనిపించేసరికి ఒళ్లు మండింది. "పనీపాటా లేదు ఇలా వస్తారస్తమానం'' అంటూ కసిరాడు.

"నేను చేసేది పనేనండీ. తమరే పనీపాటా లేకుండా ఇంటి పట్టున ఉన్నారు'' అన్నాడు ఆ కుర్రాడు పెడసరంగా. పాపం పొద్దుటినుండీ ఒక్క గిరాకీ తగలక పిచ్చెక్కి ఉన్నాడు మరి.

ఆ కుర్రాడినేమీ అనలేక తలుపులు ధడాల్ని మూసాడు. మళ్లీ ఇలా పెన్ను పట్టుకున్నాడో లేదో తలుపు టకటకా చప్పుడయింది. 'ఓరి దేవుడా' అని తల పట్టుకుంటూ తలుపు తెరిచాడు.

ఈసారి ఎదురుగా తన అక్కాబావలు కన్పించారు. రాని చిరునవ్వుని అర్జంటుగా పెదాలకు అంటించుకుని "రా అక్కా...రండి బావా. ఏంటిలా వచ్చారు?'' అనడిగాడు.

"ష్'' అనుకుంటూ సోఫాలో కూర్చున్నారిద్దరూ. వాళ్లకి మంచి నీళ్లు అందించడానికి వాణిని పిలవబోయి మళ్లీ గుర్తుకువచ్చి తనే వంటింట్లోకి వెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చాడు. అవి అందుకుంటూ "ఏంటి వాణీ ఇంట్లో లేదా?'' అంది రమణి.

"ఇంతకుముందే వాళ్లింటికి వెళ్లింది. ఏంటి ఊరకరారు మహానుభావాలు'' అన్నాడు కేశవ్ మనసులో ఇప్పుడు వీళ్లకి అన్నపానీయాలు వగైరాలు ఎలా అనుకుంటూ.

"ఇంతకుముందు వచ్చినప్పుడు ఇక్కడో ఇల్లు చూసాం. నాకు చాలా నచ్చింది. వాణి మాట్లాడబట్టి రెండులక్షలు తగ్గించారు. ఇక ఆలస్యం చేస్తే బాగోదని డబ్బు పట్టుకుని వచ్చాం ఇల్లు రిజిస్టర్ చేసుకుని వెళదామని'' అంది రమణి.

'ఈ వాణి ఇలాంటి కార్యక్రమాలు చేస్తుందా నా దుంప తెంచడానికి' అనుకుంటూ "అక్కా! మీరిద్దరూ మా అత్తగారింటికి వెళ్లి వాణిని, వాళ్లన్నయ్యను తీసుకుని ఆ పనులు చేసుకోండి. అతడికే పనులన్నీ కొట్టినపిండి. నేనూ వచ్చేవాడినేగానీ నాకర్జంటుగా ఊరికి వెళ్లే పని పడింది'' అన్నాడు కేశవ్ అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చి.

వాళ్లు అయిష్టంగానే కదిలారు. వాళ్లు వెళ్లగానే తనకు కావాల్సినవన్నీ ఓ బ్యాగ్‌లో సర్దుకుని వందమైళ్ల దూరంలో వున్న తాతగారింటికి వెళ్లడానికి బస్ ఎక్కేసాడు కేశవ్.

ఇంట్లో ఏర్పడుతున్న అవాంతరాలను తప్పించుకోవడానికి అంతకన్నా మించిన పరిష్కారం తోచలేదు మరి. తాత ఇంట్లో ఎవరూ డిస్టర్బ్ చేసేవారు ఉండరుకాబట్టి కథని అక్కడ ముగించి ఫెయిర్ చేసి పంపించాలని స్థిరంగా అనుకున్నాడు.

★★★

కేశవ్‌ను చూస్తూనే అతని తాత సత్యమూర్తి కళ్లు మెరిసాయి. మనవడిని మనసారా దగ్గరకు తీసుకున్నాడు.

"ఆ దేవుడు ఎంత కరుణామయుడో చూడు. ఎందుకో మొన్నటినుండీ నిన్ను చూడాలని ప్రాణం ఒకటే కొట్టుకుంటోంది. మీ ఆఫీసుకు ఫోన్ చేస్తే నువ్వు లీవులో వున్నావని చెప్పారు. ఇంటికి చేస్తే ఎవరూ ఎత్తడంలేదు. దాంతో ఒకటే కంగారుపడ్డాను. చూసావా రక్తపాశం. అందుకే నన్ను చూడాలని బుద్ధి పుట్టింది నీకు'' అంటూ ఆనందోద్వేగాలతో అతను కన్నీళ్లు పెట్టుకుంటుంటే నోటమాట రానివాడిలా అయిపోయాడు కేశవ్. అతని గుండెని ఎవరో మెలితిప్పినట్టయింది.

"తాతా! నీకు నేను ఉన్నానుగా. నెలకోసారి వచ్చి చూస్తాను. నిన్ను మా దగ్గరకి వచ్చి ఉండమంటే ఉండవు. పట్నంలో ఊపిరాడనట్లు ఉంటుందిరా అంటావు. నేను కనీసం రెండు నెలలకు ఒకస్సారైనా రెండురోజులపాటు వచ్చి ఉంటాగా'' అంటూ ప్రామిస్‌ల మీద ప్రామిస్‌లు చేసిన తను ఏ ఆర్నెల్లకో వచ్చి చూస్తున్నాడు.

నెలకోసారి ఫోన్ చేస్తున్నాడు. సినిమాల్లో తాతామనమల అనుబంధం చూసి చప్పట్లు చరచి కన్నీళ్లు కార్చే తను తన తాతను మాత్రం విస్మరిస్తున్నాడు. లీవ్‌లు దొరకడంలేదని అలవోకగా అనేస్తున్నాడు. ప్రచురణకు నోచుకుంటాయో లేదో తెలీని కథల కోసం ఎలాగోలా అబద్ధాలాడి లీవులు సంపాదించి వాటిని నిరుపయోగం చేస్తున్నాడేతప్ప తాత కోసం వెచ్చించడంలేదు. తనమీద తనకే అసహ్యం వేసింది కేశవ్‌కు.

తను కనిపించగానే తాత కళ్లల్లో కనిపించిన మెరుపు, ఆనందం అతని చెంపను ఛెళ్లుమన్పించాయి. తండ్రి చిన్నప్పుడే పోతే తాతే తల్లీ తండ్రీ అయి పెంచాడు.

అలాంటి తాతను తను నిర్లక్ష్యం చేస్తే తన పిల్లలు తనని నిర్లక్ష్యం చేయరా? ఇప్పటి తన ప్రవర్తనేగా తన పిల్లలకు ఆదర్శమయ్యేది.

ఇక ఆ ఆలోచన రాగానే తన కథ సంగతి పక్కన పెట్టేసి సెల్ అందుకుని "వాణీ! నువ్వు పిల్లల్ని తీసుకుని వెంటనే తాతగారి ఊరికి వచ్చేయి. నేనూ నా లీవ్‌ని ఎక్స్‌టెండ్ చేస్తున్నాను. మనమందరం సంక్రాంతి పండుగను ఇక్కడే జరుపుకుందాం'' అని చెప్పాడు క్షమాపణలతోపాటు.

కేశవ్ మాటలు విన్న సత్యమూర్తి మనసు ఆనందతరంగమైంది.

★

## గిన్నెస్ రికార్డు కెక్కిన మీసం

టర్కీకి చెందిన 62 ఏళ్ల మహ్మద్ రషీద్ ప్రపంచంలో అతి పొడవైన మీసాన్ని పెంచుతున్నాడు. గత పదేళ్లుగా పెంచిన అతని మీసం పొడవు 5 అడుగుల 3 అంగుళాలు. ఎవరైనా అతని ఫోటోని తీసుకోబోతే 5 డాలర్లు చార్జి చేస్తున్నాడట. అలా సంపాదించిన దానితో గిన్నెస్ రికార్డు స్వీకరించటానికి వెళ్ళే ఖర్చులు కలిసివస్తాయని అతని ఆశ.

## బర్త్‌డే కానుక

బ్రిటిష్ రాయల్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి ఎర్నీ రోస్కోట్ మాల్టాలో పని చేస్తున్నప్పుడు 42 సంవత్సరాల క్రితం పబ్లిక్ లైబ్రరీ నుంచి ఒక హిస్టరీ పుస్తకాన్ని తీసుకుని తిరిగి తన దేశం వెళ్లిపోతూ పొరపాటున తీసుకుపోయాడట. మళ్లీ తన 65వ ఏట మాల్టాకి టూరిస్టుగా తిరిగి వచ్చినప్పుడు ఆ పుస్తకాన్ని భద్రంగా ఆ లైబ్రరీవారికి తన బర్త్‌డే కానుక అని చెబుతూ తిరిగి ఇచ్చేసాడుట.

## మరువలేని పుట్టినరోజు

అహ్మదాబాద్‌కు చెందిన హేతల్, పింకీదవే దంపతులకు 09-09-09 తేదీన 9 గంటల 9 నిముషాలకు ఒక అమ్మాయి జన్మించింది.

-తటవర్తి

